క్లుప్తంగా

దైవ చింతన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న శివరామానంద స్వామి

సారవకోట: ప్రతిఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని చీపురుపల్లి శివశక్తి పీఠానికి చెందిన శివరామానంద స్వామి అన్నారు. మండలంలోని కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సిద్దయ్య స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా సహకార్యదర్శి చంద్రశేఖర్, బోయిన వెంకటరమణ, అల్లు రామయ్య, రామదాసు తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ పాపారావు


నియామకపత్రం అందుకుంటున్న డాక్టర్ రెడ్డి పాపారావు

ఆమదాలవలస: ఆక్యుపంచర్ సైన్స్ అసోసియేషన్ జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా మండలంలోని చిన్నజొన్నవలస గ్రామానికి చెందిన అప్పల నరసమ్మ నేచురల్ హెల్త్ కేర్ సెంటర్ వైద్యుడు రెడ్డి పాపారావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం నిర్వహించిన వరల్డ్ ఆక్యుపంచర్ డే కార్యక్రమంలో నియామకపత్రాన్ని స్వీకరించారు. ఆక్యుపంచర్ వైద్య విధానం, అవగాహన, శిక్షణ వంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామన్నారు. పాపారావుకు పలువురు అభినందనలు తెలిపారు.

అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు


గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ సూర్యప్రకాషరావు

పొందూరు: గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు డోర్ డెలివరీ చేసే సమయంలో అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఎస్‌ఓ జి.సూర్యప్రకాషరావు హెచ్చరించారు. స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని శుక్రవారం తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు సకాలంలో అందించాలని డీలర్ సరోజనికి సూచించారు. పొందూరు ఆస్పత్రి వీధిలో రేషన్ సరుకులు నవంబర్‌కు సంబంధించి బియ్యం, పంచదార, కందిపప్పు అందలేదంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్‌ఓ విచారణ చేపట్టారు. తక్షణమే రేషన్ సరుకులు పంపిణీ చేయాలంటూ ఆదేశించారు. తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, వీఆర్వోలు ఈశ్వరరావు, రేవతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేలపైనే డిగ్రీ పరీక్షలు


వరండాలో నేలపైన కూర్చొని పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో శుక్రవారం నేలపైనే కూర్చొని విద్యార్థులు పరీక్ష రాశారు. మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేని కళాశాలలకు పరీక్ష కేంద్రాలు నిలుపుదల చేయాలి. అలా కాకుండా వసతులు పూర్తిగా లేని కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రిన్సిపాల్ స్పందించి శనివారం నుంచి జరగనున్న పరీక్షలకు బెంచీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చెన్నాపురం డీలర్‌పై 6-ఏ కేసు నమోదు

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురం (244వ నంబర్) రేషన్ డిపో డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కందిపప్పు సరఫరాలో గోల్‌మాల్ అనే శీర్షికతో సాక్షిలో ఈ నెల 10వ తేదీన వార్త ప్రచురితమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణతోపాటు వీఆర్వో గ్రామంలో దర్యాప్తు చేపట్టారు. నవంబర్‌కు చెందిన 381 కేజీల సబ్సిడీ కందిపప్పు డిపోకు ఇవ్వగా.. దీంట్లో చాలా మేరకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. అధికారుల దర్యాప్తులో కందిపప్పును కార్డుదారులకు ఇవ్వలేదని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపామని డీటీ తెలిపారు.

అవస్థలు!

- వలు సచివాలయాల్లో అందని ఆధార్ సేవలు
- తరచూ సర్వర్ల మొరాయింపు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ప్రజలు


పురుషోత్తపురం సచివాలయంలో పనిచేయని ఆధార్ నమోదు కేంద్రం

సరుబుజ్జిలి: ఆధార్ నమోదు, సవరణల కోసం కిలో మీటర్ల దూరం ప్రయాణించకుండా గత ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోనే ఆధార్ సేవలను ప్రారంభించింది. ఆమదాలవలస నియోజకవర్గంలో 14 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలాచోట్ల సేవలు సక్రమంగా అందడం లేదు. దీనివలన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

ఎంపిక చేసిన ఆధార్ కేంద్రాలు ఇవే...

ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలోని సరుబుజ్జిలి మండలంలో షళంత్రి, పురుషోత్తపురం, సరుబుజ్జిలి, బూర్జ మండలంలో బూర్జ, పాలవలస, కొల్లివలస, ఆమదాలవలస మండలంలో కొర్లకోట, జొన్నవలస, ఎస్‌టీవాడ, దూసి, పొందూరు మండలంలో పొందూరు, రాపాక, లోలుగు, తాడివలస సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో సచివాలయాలు, ఆధార్ కేంద్రాల వివరాలు ఇలా..

మండలం	సచివాలయాలు	ఆధార్ కేంద్రాలు
సరుబుజ్జిలి	14	3
పొందూరు	27	4
ఆమదాలవలస రూరల్	19	4
బూర్జ	16	3

తప్పని తిప్పలు..

ఆధార్ కేంద్రాల్లో సర్వర్లు తరచూ మొరాయించడం వలన ఆధార్ సేవలు సక్రమంగా అందడంలేదు. ప్రజలు గంటల తరబడి వేచి ఉంటున్నారు. దీనివలన సుదూర ప్రాంతాల నుంచి సేవల కోసం వచ్చిన మహిళలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటి వరకు సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం, షళంత్రి, పొందూరు మండలం లోలుగు, రాపాక సచివాలయాల్లో ఆధార్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మిగిలిన వాటిలో అరకొర సేవలతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు.

ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది



సచివాలయాల్లో ఆధార్ సేవలు కచ్చితంగా లేకపోవడం వలన హిరమండలం, ఆమదాలవలస, శ్రీకాకుళంలోని ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీనివలన శ్రమ, ఆర్థిక భారం, కాలం వృథా అవుతున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు వస్తున్నాయి.

– పి.మోహన్, మతలబుపేట, సరుబుజ్జిలి

ఆధార్ సేవలు పునరుద్ధరిస్తాం



సర్వర్ల లోపాల వలన కొన్ని ఆధార్ కేంద్రాల్లో సేవలకు అంతరాయం కలుగుతుంది. వెంటనే పరిశీలన చేసి వాటిని సరిచేస్తాం. సేవలను త్వరలోనే పునరుద్ధరిస్తాం.

– ఎం.పావని, ఎంపీడీఓ, సరుబుజ్జిలి

ఘనంగా బిర్సాముండా జయంతి


జలుమూరు: బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ రామారావు, తదితరులు

జలుమూరు: మండలంలోని మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలసలో బిర్సాముండా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బిర్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు, బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై చేసిన పోరాటాలను తహసీల్దార్ జెన్ని రామారావు వివరించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, డీటీ శంకర్, ఆర్ఐ మురళి, పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా జయంతిని మండలంలోని ఆడ్డంగి, లబ్బ గిరిజన గ్రామాల్లో నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం బిర్సా చేసిన పోరాటాలను ఈఓపీఆర్డీ వసంత కుమారి, వైస్ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు వివరించారు. పలువురు గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడు?


మాట్లాడుతున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణ

కొత్తూరు: రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆరోపించారు. కొత్తూరులో గురువారం విలేకర్లతో మాట్లాడారు. వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నా.. గ్రామాల్లో ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. ప్రైవేట్ వర్తకులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఏటా నవంబర్ ఒకటో తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గుర్తుచేశారు. ఖరీఫ్ పంటలకు పెట్టుబడి సాయం కింద అందిస్తామన్న (అన్నదాత సుఖీభవ పథకం) రూ.20 వేలు ఇంతవరకు రైతులకు అందజేయలేదన్నారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పారాపురం ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్ ఉన్నారు.

కుంకుమార్చనలు



సారవకోట మండల కేంద్రంలోని సోమనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. తొలిత ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలను అర్చకులు సోమేశ్వర స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు.

– సారవకోట

60 మందికి వైద్య పరీక్షలు



నరసన్నపేట మండలం ముద్దాడపేటలో సైరిగాం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరబాధితుల వివరాలను సేకరించారు. ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 60 మందికి డాక్టర్ హేమలత తనిఖీలు చేశారు.

– నరసన్నపేట

అవగాహన



హిరమండలం మండలంలోని భగరథిపురం కాలనీలో సంకల్ప కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై కొత్తూరు సీఐ ప్రసాద్ శుక్రవారం అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్ఐ ఎం.యాసిన్, పోలీసులు పాల్గొన్నారు.

– హిరమండలం

బోరు హెడ్‌ను బిగించరూ..



సరుబుజ్జిలి మండలం బప్పడాం గ్రామంలోని తాగునీటి బోరు పాడవ్వడంతో హెడ్‌ను తొలగించారు. సుమారు నాలుగు నెలలు కావస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. మూత కూడా వేయలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బోరు హెడ్‌ను బిగించాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

కలప అక్రమ రవాణా

- అడ్డుకున్న వీఆర్వోపై దాడికి యత్నం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న టేకు దుంగలు

పాతపట్నం: మండలంలోని సవర సిద్ధమనుగుకు చెందిన జన్ని ఉమాశంకర్.. గ్రామ సమీపంలో గల ప్రభుత్వ స్థలంలోని టేకు చెట్లు నరికి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్నాడని వీఆర్వో కె.కృష్ణవేణికి, ఫారెస్ట్ సిబ్బందికి గ్రామస్తులు గురువారం సమాచారం అందించారు. వీఆర్వో గ్రామానికి చేరుకుని ప్రభుత్వ స్థలంలో ఉన్న టేకు చెట్లును ఎందుకు కొట్టారని ఉమాశంకర్‌కు అడగడంతో దాడికి ప్రయత్నంచాడు.

అక్కడ ఉన్న గ్రామస్తులు అడ్డుకున్నారు. టేకు దుంగలను తహసీల్దార్ కార్యాలయానికి వీఆర్వో చేర్చారు. ఇదే విషయమై ఉమాశంకర్‌పై వీఆర్వో కృష్ణవేణి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

బాలల హక్కులపై అవగాహన

పాతపట్నం: బాలల రక్షణ, హక్కులపై చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ జనార్దనరావు అవగాహన కల్పించారు. స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డు సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో చైల్డ్‌లైన్ సే దోస్తీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాలల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. బాల్య వివాహాల నిషేధం, గర్భస్థ లింగనిర్ధారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సంతోషి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, చైల్డ్‌లైన్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: బాలల హక్కులపై అవగాహన కల్పించాలని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ జనార్దనరావు అన్నారు అన్నారు. మండలంలోని సుభలయ ఆర్ అండ్‌ఆర్ కాలనీ పాఠశాలలో బాలల హక్కులపై శుక్రవారం అవగాహన కల్పించారు. పోస్టర్ కేర్, చట్టవ్యతిరేక దత్తత, మిషన్ వాత్సల్య, బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొత్తూరు సీడీపీఓ విమల, సూపర్‌వైజర్లు సుధావాణి, ఈశ్వరి, ఎం.జి.బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్వాలా తోరణం


సారవకోట: జ్వాలా తోరణం వెలిగిస్తున్న భక్తులు


నరసన్నపేట: స్టేట్‌బ్యాంక్ వీధిలో కేథారేశ్వర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని నిర్వహించిన జ్వాలా తోరణం ఆకట్టుకుంది. ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కేథారేశ్వరుని పూజలు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో

సారవకోట: మండలంలోని అవలింగి మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం జ్వాలా తోరణం ఏర్పాటు చేశారు. తొలిత ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించి రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు. అలుదు రామాలయం ఆవరణలో జ్వాలా తోరణం, దీపారాధన చేపట్టారు.

పుస్తక ప్రదర్శన

గ్రంథాలయాలను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగించాలని వక్తలు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారులు, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


హిరమండలం: గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


కొత్తూరు: శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు


బూర్జ: గ్రంథాలయంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు


పాతపట్నం: గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శను తిలకిస్తున్న ఈఓ వరప్రసాదరావు, విద్యార్థులు


నరసన్నపేట: డిగ్రీ కళాశాలలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ పి.లత, విద్యార్థులు

6 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

పాతపట్నం: మండలంలోని కమలమ్మకోట్టు కూడలి వద్ద ఆరు మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని స్థానిక ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.కృష్ణారావు శుక్రవారం తెలిపారు. గురండి గ్రామానికి చెందిన వ్యక్తి ఆరు మద్యం బాటిళ్లను తీసుకువెళ్తుండగా పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం ధరల పట్టికను దుకాణాల ముందు తప్పనిసరిగా ఉంచాలని సీఐ తెలిపారు.


20 లీటర్ల సారా స్వాధీనం

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన మహిళను 20 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు శుక్రవారం తెలిపారు. నాటు సారాను బుడితిలో విక్రయిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సభ్యులు పట్టుకున్నట్లు చెప్పారు. ఆమెకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించిందన్నారు. అక్రమంగా మద్యం నిల్వ లున్నా, సారా విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఆమదాలవలస: అపార్ నమోదులో పొరపాట్లను సరి చేసేందుకు ఆయా క్లస్టర్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్ల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం మండలంలోని కొర్లకోట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపీడీఓ రోణంకి వెంకటరావుతో కలిసి ప్రారంభించారు. మండలంలోని కొర్లకోట, అక్కులపేట, దూసిపేట, తొగరాం, ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్ గవర్నమెంట్ హైస్కూళ్లలో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పడిగాపులు..


సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలస గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం వద్ద విద్యార్థులు సాయంత్రం వరకు వేచి ఉన్నారు. అపార్‌కు సంబంధించి ఆధార్ కార్డులో ఎలాంటి తప్పులు లేకుండా ఉండాలని నిబంధన ఉంది. దీంతో తప్పులు సరిదిద్దుకునేందుకు ఆధార్ కేంద్రాల చుట్టూ విద్యార్థులు తిరుగుతూ రోజంతా అక్కడే ఉంటున్నారు. పుట్టిన తేదీ, ఇంటి పేరు, విద్యార్థి పేరు, చిరునామా, తండ్రి పేరు, వయసు ఇలా ఒక్కొక్క విద్యార్థి ఒక్కక్క రకమైన తప్పు సరి చేసుకునేందుకు తల్లిదండ్రులతోపాటు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉంటున్నారు. విద్యార్థుల కోసం పాఠశాలల వద్దే ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.